# సాక్షి
# అన్నమయ్య జిల్లా

మంగళవారం । 20 । జూన్ । 2023




**క్రీడలలో నందలూరుకు గుర్తింపు**

సివిల్స్‌లోనే కాదు క్రీడల్లో కూడా నందలూరుకు ప్రత్యేక గుర్తింపు ఉందని మహారాష్ట్రలోని బీడ్ జిల్లా మాజల్గామ్ ఏఎస్పీ ఐపీఎస్ అధికారి బచ్చు ధీరజ్‌కుమార్ అన్నారు. - 8లో



**భూములు కోల్పోయాం.. ఉద్యోగాలు ఇప్పించండి**

ఏపీఎండీసీ గనుల విస్తరణలో ఇల్లు, భూములు కోల్పోయిన తమకు ఉద్యోగాలు ఇప్పించాలని నిరుద్యోగులు నిరసన చేపట్టారు. - 8లో

**మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)**

| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.310 | రూ.380 |
| రెండోరకం | రూ.220 | రూ.300 |



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1,546 మెట్రిక్ టన్నులు

**పట్టుగూళ్ల ధరలు (రూ.లో)**

| రకం | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| బైవోల్టిన్ | 455 | 530 |
| సీబీ | - | - |



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 490.60 కిలోలు

## న్యూస్‌రీల్

### వేగవంతంగా జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారం



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

రాయచోటి : జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణలు హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా గడువులోపు పరిష్కరించాలని జేసీ చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ప్రజా సమస్యలపై బాధ్యతగా మెలగాలి

గుర్రంకొండ : ప్రజల నుంచి వచ్చే సమస్యల పట్ల బాధ్యతతో మెలిగి పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. సోమవారం గుర్రంకొండ పట్టణంలోని మూడు సచివాలయాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా సచివాలయ ఉద్యోగుల హాజరు పట్టికలను, విధుల జాబితాను పరిశీలించారు. వివిధ రకాల సమస్యలపై సచివాలయాలకు వచ్చే ప్రజలతో మర్యాదగా మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఖాజాబీ, ఎంపీడీఓ వెంకటేశులు, ఆర్‌ఐ మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### 22న వీరభద్రస్వామి ఆలయంలో వేలంపాట

రాయచోటి టౌన్ : రాయచోటి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయానికి చెందిన రూం నంబర్ - 3 లీజ్ కోసం వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఆలయ ఆవరణలో ఫొటోలు, పేపర్ ఫొటోలు, అమ్ముకొనే హక్కు, వివాహాలకు, ఫంక్షన్లకు షామియానా, పూల డెకరేషన్, ఎలక్ట్రికల్ డెకరేషన్, కుర్చీలు, టేబుళ్లు, వంట పాత్రలు సరఫరా చేసేందుకు వేలం నిర్వహిస్తామన్నారు. 22వ తేదీ ఉదయం ఆలయ ఆవరణంలో వేలంపాట ఉంటుందన్నారు.

### పల్లకీలో ఊరేగిన భద్రకాళీ సమేతుడు



రాయచోటిటౌన్ : రాయచోటిలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి పల్లకీలో ఊరేగాడు. సోమవారం రాత్రి మూల విరాట్‌లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను పల్లకీలో మాఢవీధులలో ఊరేగించారు. ఈ పల్లకీ సేవ ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచి పెట్టారు.

### పార్వతీదేవికి వెండి కిరీటం బహూకరణ



నిమ్మనపల్లె : తవళం గ్రామంలోని శ్రీయోగ నేలమల్లేశ్వరస్వామి దేవాలయంలోని పార్వతీ దేవికి రూ.75వేల విలువగల వెండి కిరీటాన్ని కురబలకోట మండలం అంగళ్లుకు చెందిన పి.ఎస్.కృష్ణమూర్తి(టమాటో మండీ వ్యాపారి) కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం ఆలయ తాత్కాలిక కమిటీ సభ్యులు గోపాలకృష్ణకు అందజేశారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి కిరీటాన్ని అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శంకరశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

## సౌందర్యవంతుడు..
# నందలూరు సౌమ్యనాథుడు !

- చోళుల కళానైపుణ్యానికి అద్దంపట్టే ఆలయం
- ఎలాంటి దీపంలేకున్నా దేదీప్యమానంగా స్వామి దర్శనం
- 27 నుంచి జులై 7 వరకు సౌమ్యనాథుని బ్రహ్మోత్సవాలు
- 4న సౌమ్యనాథస్వామి కల్యాణోత్సవం
- ప్రభుత్వం తరపున ఎమ్మెల్యే మేడాచే ముత్యాల తలంబ్రాలు

సౌమ్యనాథుడన్నా.. చొక్కనాథుడన్నా సౌందర్యవంతుడని అర్థం. సౌమ్యనాథుడనగా సౌమ్యకు(శ్రీలక్ష్మీదేవికి) నాథుడని అర్థం. స్వామి మూలవిరాట్టు ఏడడుగుల ఎత్తు ఉండి చాలా సౌమ్యంగా అభయ ముద్రాలంకితమై ఉంటుంది మరో వారం రోజుల్లో నందలూరుసౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం..





చోళులకాలంలో నందలూరులో నిర్మితమైన శ్రీ సౌమ్యనాథాలయం (ఇన్‌సెట్) నారదమహర్షి ప్రతిష్టించిన మూలవిరాట్టు

రాజంపేట : దక్షిణ భారతదేశంలోఉన్న సుప్రసిద్ధ ఆలయాల్లో అన్నమయ్య జిల్లా నందలూరులోని శ్రీ సౌమ్యనాథాలయం కూడా ఒకటి. శ్రీ సౌమ్యనాథునికి చొక్కనాథుడని, చొక్కనాథ పెరుమాళ్ అని, కులోత్తుంగచోళ ఎంబరుమన్నార్ విన్నగర్ అనే పేర్లు ఉన్నాయి. దీన్ని బట్టి చూస్తే తమిళనాడుతో ఈ ఆలయానికి చారిత్రక అనుబంధం ఉందనే చరిత్రకారులు చెబుతున్నారు.

**ప్రత్యేకత**

బ్రహ్మమానసపుత్రుడు.. త్రిలోకసంచారి..లోకకల్యాణకారకుడు..కలహప్రియుడు నారదుడు నందలూరు గ్రామంలో వెలసిన సౌమ్యనాథాలయంలో సౌమ్యనాథ స్వామి మూలవిరాట్టును ప్రతిష్ఠించాడని శాసనాలు ధ్రువీకరిస్తున్నాయి.

**ఆలయచరిత్ర**

చోళవంశరాజు కుళోత్తుంగచోళుడు 11 వశతాబ్దంలో శ్రీ సౌమ్యనాథస్వామి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. చోళ, పాండ్య, కాకతీయ, విజయనగరరాజులచే 17వ శతాబ్దం వరకు ఆలయ నిర్మాణం కొనసాగింది. పతిరాజులు కాలంలో ఆలయం ప్రసిద్ధి చెందింది. 12వ శతాబ్దంలో కాకతీయ ప్రతాపరుద్రుడు రాజగోపురం కట్టించాడు. ప్రసిద్ధ వాగ్గేయకారుడు తాళ్లపాక అన్నమాచార్య జన్మస్థలమైన తాళ్లపాక గ్రామం నందలూరుకు సమీపంలో ఉన్నందున అన్నమాచార్యులు సౌమ్యనాథాలయాన్ని దర్శించుకొనేవారు. స్వామివారిపై శృంగార కీర్తనలు రచించారు. ఆలయం చుట్టూ తొమ్మిది ప్రదక్షిణలు చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయనే విశ్వాసం భక్తుల్లో ప్రగాఢంగా ఉంది.

**ఆలయ నిర్మాణమిలా..**

దాదాపు 10 ఎకరాల విస్తీర్ణంలో 180 స్తంభాలతో వైఖానస, వైష్ణవగామ ఆర్షపోక్త వాస్తుయుక్తంగా నిర్మించిన సువిశాలమైనరీతిలో శ్రీసౌమ్యనాథాలయం ఉంది. ఈ ఆలయానికి 120 ఎకరాల మాన్యం ఉన్నట్లు ఆలయ శాసనాల ద్వారా తెలుస్తోంది. ఇప్పుడు ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడంలేదు. రాజంపేట మండలంలోని అడపూరు, మన్నూరు, మందరం, హస్తవరం అనే ఐదు గ్రామాలను బహుమానంగా ఇచ్చినట్లు శాసనాలు చెబుతున్నాయి. ఆలయంలో అధికంగా తమిళ శాసనాలు కనిపిస్తాయి. సింహద్వారంలో గాలిగోపురం ఉత్తరగోపురం, దక్షిణగోపురం ద్వారాలు ఉన్నాయి. ఆలయంలో రాతిదీపస్తంభం, బలిపీఠం, ధ్వజస్తంభం, గరుడమందిరం, మత్స్యమంటపం, ఆంజనేయమంటపం, చిన్నకోనేరు, జయవిజయాలు, అంకురార్పాణ మంటపం, వంటశాల, శ్రీ యోగనరసింహస్వామి, శిల్పకళ, అంతరాళం ఉన్నాయి.

**ఎలాంటి దీపం లేకున్నా..**

ఆలయంలో ఎలాంటి దీపం లేకున్నా సౌమ్యనాథ స్వామి వారు ఉదయం నుంచి సాయంకాలం వరకు దేదీప్యమానంగా వెలుగొందే విధంగా ఆలయం నిర్మించడం అద్భుతం. గర్భగుడి ప్రధాన ద్వారానికి వందగజాల దూరం నుంచి కూడా స్వామి చాల స్పష్టంగా కనిపిస్తారు. యేడాదిలో ఏదో ఒక రోజు సూర్యకిరణాలు స్వామివారి పాదాలపై ప్రసరించే విధంగా శిల్పులు నిర్మించారు.

**ఆలయ కుడ్యాలపై మత్స్య, సింహ చిహ్నాలు..**

ఆలయ కుడ్యాలపై (లోపల)పై భాగంలో మత్స్య, సింహ చిహ్నాలు ఉన్నాయి. మత్స్య ఆకారాన్ని మలిచి ఉన్నారు. భవిష్యత్తులో పెద్దఎత్తున వరదలు వచ్చి ఆలయాన్ని ముంచెత్తినప్పుడు ఆలయ పైభాగంలో ఉండే మత్స్యకు ప్రాణం వచ్చి వరదలలో కలిసిపోతుందని స్థానికుల నమ్మకం. అంటే అప్పటికి కలియుగం అంతమైపోతుందనే అర్థం వస్తుందని చెపుతుంటారు.

**శాసనాలు..**

ఆలయంలో 54 శాసనాలు ఉన్నాయి. తొలిశాసనం క్రీస్తుశకం 1078లోనిది కాగా, క్రీ.శ 1619 లోని శాసనం చివరి శాసనంగా గుర్తించారు. ఇందులో దానశాసనాలే అధికంగా ఉన్నాయి. ఈ శాసనాలలో ఉన్న వాటికి సంబంధించి ఇప్పుడైతే ఏమీ లేవనే స్పష్టమవుతోంది.

**బ్రహ్మోత్సవాలు ఈ విధంగా...**

ఈనెల 27న మంగళవారం ఉదయం తిరుమంజనం, రాత్రి అంకురార్పారణ కార్యక్రమం నిర్వహించనున్నారు. 28న ధ్వజ ఆరోహణం, రాత్రికి యాళివాహనంపై స్వామి వారు ఊరేగనున్నారు. 29న ఉదయం పల్లకీసేవ, రాత్రి హంసవాహనం, 30న ఉదయం పల్లకీసేవ, రాత్రి సింహవాహనం ఉంటుంది. జులై 01న ఉదయం పల్లకీసేవ, రాత్రి హనుమంతవాహనం, 02న ఉదయం శేషవాహనం, రాత్రి గరుడవాహనం, 03న ఉదయం సూర్యప్రభ, రాత్రికి చంద్రప్రభ, 04న ఉదయం కళ్యాణోత్సవం, రాత్రి గజవాహనం, 05న రథోత్సవం , రాత్రికి అశ్వవాహనం, 06న వసంతోత్సవం, చక్రస్నానం, రాత్రికి ధ్వజాఅవరోహణ , 07న పుష్పయాగం కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

**విలీనం తర్వాత టీటీడీచే తొలిసారిగా బ్రహ్మోత్సవాలు**



సౌమ్యనాథాలయం టీటీడీలోకి విలీనం తర్వాత తొలిసారిగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతాయని ఆశిస్తున్నాము. బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ సర్వం సిద్ధం చేస్తోంది. భక్తులకు సకల సౌకర్యాలు కల్పించే దిశగా టీటీడీ అన్ని చర్యలు తీసుకుంటోంది. గతంలో కంటే వైభవంగా స్వామి వారి బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు టీటీడీకి తమవంతుగా సహకారం అందిస్తున్నాం. ప్రభుత్వం తరపున ముత్యాల తలంబ్రాలను ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి సమర్పించనున్నారు.

– మేడా విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీపీ, నందలూరు

**27 నుంచి సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు**



ఈనెల 27 నుంచి నందలూరు సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ప్రత్యేకంగా స్వామి వారి కళ్యాణోత్సవం రోజున ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ప్రభుత్వం తరఫున ముత్యాల తలంబ్రాలను అందజేయనున్నారు. భక్తులు విరివిగా వస్తున్న క్రమంలో సౌకర్యాల కల్పనపై ప్రధాన దృష్టి కేంద్రీకరించాం. సివిల్, ఎలక్ట్రికల్ పనులు చేపట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాము.

– నటేష్‌బాబు, డిప్యూటీఈవో, టీటీడీ, ఒంటిమిట్ట

# బహుజనులకు రాజ్యాధికారమే లక్ష్యం



చైతన్యయాత్ర ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు రాంజీగౌతమ్

**బహుజన రాజ్యాధికార చైతన్యయాత్ర ముగింపు సభలో రాజ్యసభ సభ్యుడు రాంజీగౌతమ్**

మదనపల్లె : ఆధిపత్య వర్గాల దోపిడీని అడ్డుకుని, బహుజనులకు రాజ్యాధికారం రావాలని, సామాజిక న్యాయమే లక్ష్యంగా బహుజన ఉద్యమాన్ని ముందుకు తీసుకెళుతున్న పార్టీ బీఎస్పీ అని రాజ్యసభ సభ్యుడు, ఏపీ బీఎస్పీ ఇన్‌చార్జి రాంజీగౌతమ్ అన్నారు. బహుజనులకు రాజ్యాధికారంతోనే పేదల జీవితాల్లో మార్పు వస్తుందని చెప్పారు. సోమవారం అన్నమయ్య జిల్లా మదనపల్లెలో బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో బహుజన రాజ్యాధికార చైతన్యయాత్ర ముగింపు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రజాధనాన్ని అదానీ, అంబానీలకు దోచిపెడుతోందన్నారు. దేశంలో, రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు, స్థితిగతులు వేగంగా మారుతున్నాయని చెప్పారు. అంబేద్కర్ సిద్ధాంతం, కాన్షీరామ్ పని విధానంతో పార్టీని బలోపేతం దిశగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. బీఎస్పీ ఏపీ అధ్యక్షుడు పరంజ్యోతి మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో రాష్ట్రంలోని 175 స్థానాల్లో బీఎస్పీ పోటీచేస్తుందన్నారు. తెలంగాణ బీఎస్పీ అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగమే మేనిఫెస్టోగా బీఎస్పీ పనిచేస్తుందని, బహుజనులు అధికారం దక్కించుకున్నప్పుడే సామాజిక న్యాయం అమలవుతుందన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ బాలయ్య, చిత్రసేన్, నాయకులు నందన్‌కుమార్, గుర్రప్ప, సత్యం, జానకీప్రసాద్, డేవిడ్‌రెడ్డిపోగు, విజయ్, శ్రీరాములు, గోవింద్, కంగేరినందా తదితరులు పాల్గొన్నారు.

# నేతన్న నేస్తం.. ఆపన్న హస్తం

**• టీడీపీ ప్రభుత్వంలో..**

నాడు

చేనేత రంగ సంక్షేమాన్ని గత టీడీపీ ప్రభుత్వం విస్మరించింది. పెరిగిన ముడిపట్టు ధరలతో కార్మికులు అల్లాడిపోతుంటే ముడిపట్టు రాయితీ నెలకు రూ. 600 ఇవ్వడానికి కూడా అప్పటి సీఎం చంద్రబాబుకు చేతులు రాలేదు. ఎప్పుడో 6 నెలలకో, పది నెలలకో ఒకసారి రాయితీ సొమ్ము అరకొర ఇచ్చి చేతులు దులుపుకునేవారు. అది కూడా సెరికల్చర్ కార్యాలయాల చుట్టూ వారాల తరబడి తిరిగితేనే పనయ్యేది. సాంకేతిక సమస్యతో ఎవరికైనా డబ్బు అందకపోతే దాని గురించి మరచిపోవాల్సిందే.

**• వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో..**

నేడు

చేనేతలకు అండగా నిలుస్తామని ఎన్నికల ముందు చెప్పిన వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే 'నేతన్న నేస్తం' పథకాన్ని ప్రవేశపెట్టారు. అర్హులైన నేతన్నలకు ఖాతాలో రూ.24 వేలు జమ చేస్తున్నారు. ఇందుకు ఎవరి సిఫారసు అవసరం లేదు. ఏ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పనిలేదు. అన్నీ పరిశీలించి అర్హులకు పథకం అందేలా చూస్తున్నారు.

- పథకం కింద రూ.24 వేలు నగదు జమ
- క్రమం తప్పకుండా నేతన్న నేస్తం
- ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం

మదనపల్లె సిటీ : జనరంజక పాలనలో అన్ని వర్గాల అభిమానాన్ని చూరగొంటున్న వైఎస్ జగన్ సర్కార్ నేతన్నలకూ అండగా నిలుస్తోంది. ముడిపట్టు రాయితీ కోసం 'నేతన్న నేస్తం' పేరుతో ఏటా రూ.24 వేలు అందజేస్తోంది. జిల్లాలో ప్రధానంగా మదనపల్లె పట్టణం (నీరుగట్టువారిపల్లె), తంబళ్లపల్లె, బి.కొత్తకోట, పీలేరు, వాల్మీకిపురం, కలకడ, సంబేపల్లి, చిన్నమండెం, రాయచోటి, రాజంపేటలలో చేనేత కార్మికులు అధికంగా ఉన్నారు.

**2019 నుంచి నేతన్న నేస్తం**

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేనేతలను ఆదుకునేందుకు ముందుకు వచ్చారు.



చేనేత మగ్గం

ఇందులో భాగంగా 2019 డిసెంబర్ 21న సత్యసాయి జిల్లా ధర్మవరంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతన్న నేస్తం పథకాన్ని ప్రారంభించారు. అర్హులైన ప్రతి చేనేత కార్మికుని ఖాతాలో ఒకేసారి రూ.24 వేలు జమ చేశారు. దీంతో చేనేత కార్మికులు కావాల్సిన ముడి పట్టును కొనుగోలు చేసుకుని తమ కాళ్లపై నిలబడ్డారు. ఎంతో మంది నేతన్నలకు నేతన్న నేస్తం ఊరటనిచ్చింది.

**ఏటా క్రమం తప్పకుండా జమ**

కరోనా నేపథ్యంలో ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే ఉన్నా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతన్నకు ఆర్థికంగా అండగా నిలిచారు. ఏటా క్రమం తప్పకుండా 'నేతన్న నేస్తం' పథకాన్ని అమలు చేస్తూ వచ్చారు. జిల్లాలో గత ఏడాది నేతన్న నేస్తం పథకం కింద 7,202 మంది చేనేత కార్మికులకు రూ.17,28,48,000 అందజేశారు. ఈ ఏడాది ఐదో సారి నేతన్న నేస్తం ఇచ్చేందుకు అధికారులు సిద్ధం చేస్తున్నారు.

**ఊరట నిచ్చింది**



నా పేరు హేమలత. మదనపల్లె పట్టణం వెంకటేశ్వరపురంలో చేనేత మగ్గం నేస్తూ జీవిస్తున్నా. నేను నా భర్త వెంకటచంద్రలు కలిసి రెండు మగ్గాలలో పని చేస్తున్నాం. గతంలో ముడిపట్టుదారం కొనాలంటే కష్టంగా ఉండేది. నేతన్న నేస్తం సొమ్ము వల్ల మాకు ఊరట కలిగింది. సీఎం నేతన్నలకు ఎంతో సహాయం చేస్తున్నారు.

# ప్రోత్సాహకాలతో ఉన్నత లక్ష్యసాధన

- జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్
- పేదల రాత మార్చేది చదువే : రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి
- అట్టహాసంగా జిల్లా స్థాయి జగనన్న ఆణిముత్యాలు



ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు



జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు

రాయచోటి : ప్రోత్సాహకాలతో విద్యార్థులు పోటీతత్వాన్ని మరింత పెంచుకొని ఉన్నత లక్ష్యసాధన దిశగా అడుగులు వేస్తారని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అన్నారు. సోమవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి లయ గార్డెన్‌లో 2022–23వ సంవత్సరంలో ప్రభుత్వ, జెడ్పీ, ఏపీ మోడల్, కేజీబీవీ, మునిసిపల్, రెసిడెన్షియల్, ఏపీఎస్‌డబ్ల్యుఆర్, ఏపీడబ్ల్యుఆర్‌ఈఐ యాజమాన్యాలలో పదవ తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులను జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్న ఆణిముత్యాలు తీసుకురావడం విద్యార్థులకు టానిక్‌లాగా పనిచేస్తుందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రతి విద్యార్థిలో ఆత్మస్థైర్యాన్ని నింపుతాయన్నారు.

**పేదల రాత మార్చేది చదువే**

పేదల తలరాతలు మార్చేది చదువు ఒక్కటే అని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలతో విద్యార్థులలో పోటీతత్వం పెరిగి మంచి ఫలితాలు వస్తాయన్నారు. మహనీయులు అంబేద్కర్ లాంటివారి జీవిత చరిత్రలను విద్యార్థులు చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా సీఎం జగన్ విద్యను అందిస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ముఖ్యమంత్రి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు.

**జగనన్న ఆణిముత్యాలు పథకం వరం లాంటిది**

జగనన్న ఆణిముత్యాలు పథకం విద్యార్థులకు వరం లాంటిదని ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి అన్నారు. సీఎం జగన్ విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి సమూల మార్పులు తీసుకువచ్చారన్నారు. జగన్ మా మయ్య ఇస్తున్న ప్రోత్సాహకాలను విద్యార్థులు బాగా సద్వినియోగం చేసుకొని భావిభారత పౌరులుగా ఎదిగి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలన్నారు.

**విద్యకు అధిక ప్రాధాన్యత**

సీఎం జగన్ విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని మునిసిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా తెలిపారు. విద్యా విధానంలో సీఎం జగన్ సమూల మార్పులు తీసుకొచ్చారన్నారు.

**48 మంది విద్యార్థులకు నగదు బహుమతి, మెరిట్ సర్టిఫికెట్లు మెడల్స్ అందజేత**

జిల్లా స్థాయి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో 48 మంది విద్యార్థులకు నగదు బహుమతి, మెరిట్ సర్టిఫికెట్లు, మెడల్స్‌ను కలెక్టర్, రాయచోటి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మునిసిపల్ చైర్మన్లు అందజేశారు. ఇందులో 28 మంది పదో తరగతి, 20 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులు ఉన్నారు. పదిలో టాపర్లకు రూ.50 వేలు, రెండో స్థానం సాధించిన వారికి రూ.30 వేలు, మూడో స్థానం సాధించిన విద్యార్థులకు రూ.15 వేలు, ఇంటర్‌లో నాలుగు గ్రూపుల్లో అత్యధిక మార్కులు సాధించిన ఒక్కొక్కరికి రూ.50 వేల నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈఓ శ్రీరామ్‌పురుషోత్తం, డీవైఈఓ కృష్ణయ్యనాయక్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి, ఇతర ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు, సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలు, కళాశాల ప్రిన్సిపాల్‌లు తదితరులు పాల్గొన్నారు.

**ఎన్సీడీసీడీ సర్వేలో ప్రగతి సాధించాలి**

జిల్లాలో జరుగుతున్న ఎన్సీడీ సీడీ సర్వేలో భాగంగా వచ్చే వారంలోగా 84 శాతం ప్రగతిని సాధించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ వైద్యాధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వైద్య, ఆరోగ్యశాఖకు సంబంధించి ఎన్సీడీసీడీ సర్వే, ఫ్యామిలీ డాక్టర్ సేవలు, ఇతర అంశాలలో సాధించిన ప్రగతిపై వైద్యాధికారులతో జూమ్ వీసీ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. రెండు మూడు రోజులలో అందరికీ పరీక్షలు నిర్వహించాలన్నారు. అలాగే జాతీయ కుష్ఠు నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఈనెల 26వ తేదీ నుంచి జూలై 16వ తేదీ వరకు కుష్ఠువ్యాధిపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని లెప్రసీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, వైద్యాధికారులు, లెప్రసీ అధికారులు, పీహెచ్‌సీ డాక్టర్లు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

**సచివాలయాల్లో భూముల రిజిస్ట్రేషన్‌లు**

సంబేపల్లె : సచివాలయాల్లో భూముల రిజిస్ట్రేషన్ సేవలు ప్రాంభమయ్యాయని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. మండలంలోని నారాయణరెడ్డిపల్లె గ్రామ సచివాలయంలో మొట్టమొదటిసారిగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల ద్వారా జనం ముంగిటకే పాలనా వ్యవస్థను తీసుకొచ్చిన ప్రభుత్వం తాజాగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను కూడా అందుబాటులోకి తెచ్చిందన్నారు. సచివాలయంలో వ్యవసాయ భూములకు సంబంధించిన దస్తావేజులు అందుబాటులో ఉంటాయన్నారు. తమ గ్రామంలోనే రిజిస్ట్రేషన్ సేవలు ప్రారంభం కావడం శుభపరిణామమని , ఇలాంటి సేవలు పల్లె ముంగిటకు తీసుకొచ్చినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేల్యాండ్ అండ్ రికార్డ్స్ ఏడీ జయరాజు, తహసీల్దార్ మహేశ్వరిబాయ్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### విద్యార్థి అదృశ్యం


దీక్షిత్ (ఫైల్)

మదనపల్లె : ఇంజినీరింగ్ విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా తెలిపారు. పట్టణంలోని రాంరెడ్డి లేవుట్‌కు చెందిన రామిశెట్టి పురుషోత్తం కుమారుడు దీక్షిత్(19) ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం పూర్తి చేశాడు.ఆదివారం స్నేహితుడి పుట్టినరోజు వేడుకలు ఉన్నాయని ఇంటి నుంచి వెళ్లాడు.తర్వాత ఇంటికి రాకపోవడం, అతని సెల్‌ఫోన్ పనిచేయకపోవడంతో కుటుంబసభ్యులు గాలించారు. అయినా ఫలితం లేకపోవడంతో సోమవారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్‌రెడ్డి సీఐ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఒంటె దాడిలో వ్యక్తికి గాయాలు

మదనపల్లె : ఒంటె దాడి చేయడంతో ఓ వ్యక్తి గాయపడిన సంఘటన సోమవారం మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని దేవళంవీధికి చెందిన గౌస్(20) బక్రీద్ సందర్భంగా ఖుర్బానీ పంపకాలకై ఒంటెను తీసుకువచ్చాడు. మేపేందుకు పట్టణ సమీపంలోకి తీసుకెళ్లాడు. ఒంటెకు ఆహారంగా చెట్ల కొమ్మలు నరికి వేస్తుండగా ఆకస్మాత్తుగా గౌస్ చేతిని పట్టుకుని పైకి ఎత్తి కిందకు పడేసింది. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్నేహితులు అతన్ని ఆస్పత్రికి తరలించారు.

### లారీ,బైక్ ఢీ: ఇద్దరి మృతి

చెన్నూరు : వైఎస్సార్ జిల్లా పాలెంపల్లి సమీపంలోని ఈచర్ షోరూం సమీపంలో ఆదివారం రాత్రి లారీ, ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. ఎస్సై శ్రీనివాసరెడ్డి కథనం మేరకు పాలెంపల్లి గ్రామానికి చెందిన వెంకటేష్ (18), కడప కు చెందిన వెంకట విజయ్ (20)లు బైక్‌లో డాబా వద్దకు వెళుతుండగా ప్రమాదం జరిగింది.వెంకటేష్ ఘటనా స్థలంలో మృతి చెందగా, వెంకట విజయ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు.

# భూములు కోల్పోయాం.. ఉద్యోగాలు ఇప్పించండి


ఏపీఎండీసీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నిర్వాసిత కుటుంబాలు


సీపీఓ సుదర్శన్‌రెడ్డితో మాట్లాడుతున్న మంగంపేట నిర్వాసితులు

**ఏపీఎండీసీ కార్యాలయం ఎదుట నిర్వాసితుల నిరసన**

ఓబులవారిపల్లె : ఏపీఎండీసీ గనుల విస్తరణలో ఇల్లు, భూములు కోల్పోయామని, తమకు ఉద్యోగాలు ఇప్పించాలని 19 కుటుంబాలకు చెందిన నిరుద్యోగులు జోరువానలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాలతో సోమవారం ఏపీఎండీసీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. 2006 లో గనుల విస్తరణలో వీరు ఇల్లు, భూములు కోల్పోయారు. ఎలాంటి పరిహారం, ఉద్యోగాలు తీసుకోలేదు. తమ కంటే వెనుక ఇల్లు, భూములు కోల్పోయిన కుటుంబాలకు పరిహారం ఉద్యోగాలు కల్పించడంతో సంవత్సరాలుగా న్యాయ పోరాటం చేస్తున్నామని వారు తెలిపారు. ఏపీఎండీసీ ఎండీగా వీజీ వెంకట్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక కమిటీ ఏర్పాటు చేసి విచారణ నిర్వహించారు.ఉద్యోగాలు, పరిహారం తీసుకోలేదని నిర్ధారించడంతో 2022 ఫిబ్రవరి 22న 19 మందికి అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు విజయవాడ కార్యాలయం నుంచి మంగంపేట ఏపీఎండీసీ బ్రాంచ్‌కు ఉత్తర్వులు పంపారు.దీంతో ఉద్యోగాల్లో చేరేందుకు మంగంపేట కార్యాలయానికి 2022 ఫిబ్రవరి 23న ఉద్యోగులు వెళ్లారు. అయితే తమ ఉద్యోగాలను హోల్డ్‌లో ఉంచాలని ఎండీ ఆదేశాలు జారీ చేశారని అధికారులు తెలిపారు. దీంతో వారు నిరాశతో వెనుదిరిగారు. ఈవిషయాన్ని స్థానిక వైఎస్సార్ పార్టీ నాయకులతో కలిసి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి ఉద్యోగులకు న్యాయం చేయాలని ఏపీఎండీసీ అధికారులను ఆదేశించారు.అయినా ఏపీఎండీసీ అధికారులు ఇప్పటికి న్యాయం చేయలేదు. దీంతో 19 మంది ఉద్యోగులు సోమవారం ఏపీఎండీసీ కార్యాలయం ఎదుట జోరు వానలోనూ నిరసనలను చేపట్టారు. నిరసన చేసుకునేందుకు శనివారం ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని, ఆదివారం సెలవు కావడంతో విజయవాడ నుంచి ఉత్తర్వులు రాలేదని, అందువల్లే టెంట్‌లను తొలగించామని సీపీఓ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. అనంతరం కార్యాలయంలో సీపీఓ సుదర్శన్‌రెడ్డితో నిర్వాసితులు మాట్లాడారు. తమకు ఇచ్చిన ఉద్యోగాలను ఎందుకు హోల్డ్‌లో ఉంచారు..న్యాయం చేయాలని ముఖ్యమంత్రి చెప్పినా పట్టించుకోరా అని ప్రశ్నించారు. ఇందుకు స్పందించిన సీపీఓ మాట్లాడుతూ ఈ విషయం ఏపీఎండీసీ విజయవాడ ఎండీ కార్యాలయం పరిధిలో ఉందని తెలిపారు.

**పదహారేళ్లుగా పోరాడుతున్నాం**



గనుల విస్తరణలో ఇల్లు, భూములు కోల్పోయాం. 2006 నుంచి పరిహారం, ఉద్యోగాల కోసం అధికారులు నాయకులు చుట్టూ తిరుగుతున్నాం. పదహారు సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నాము. మాకు ఉద్యోగులు ఎప్పుడు ఇస్తారు. యాజమాన్యం వెంటనే స్పందించి మాకు న్యాయం చేయాలి.

- వెన్నపూస రమాదేవి, నిర్వాసితురాలు, మంగంపేట

**న్యాయం చేయాలి**



2022 సంవత్సరం ఫిబ్రవరి 22 న 19 మంది నిర్వాసిత కుటుంబాలకు ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు ఉత్తర్వురులు జారీ చేశారు. మరుసటి రోజు వాటిని ఎందుకు హోల్డ్‌లో ఉంచారు. కమిటీ విచారించిన అనంతరమే తమకు ఉద్యోగులు ఇచ్చారు.తమ పట్ల ఎందుకీ వివక్ష, వెంటనే న్యాయం చేయాలి.

-సౌభాగ్యవతి, నిర్వాసితురాలు, మంగంపేట

# న్యాయం కోసం వెళితే బాధితుడిపై సీఐ రుబాబు


ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న బాధిత కుటుంబం

మదనపల్లె : స్నేహితుల దాడిలో తీవ్రంగా గాయపడి న్యాయం కోసం పోలీస్‌స్టేషన్‌కు వెళితే పట్టించుకోకపోగా, పైపెచ్చు తాలూకా సీఐ సత్యనారాయణ తమనే దుర్భాషలాడి రుబాబు చేశారని బాధితుడు ఆదిరామమూర్తి వాపోయాడు. తాలూకా పోలీస్‌స్టేషన్‌లో తనకు జరిగిన అన్యాయంపై సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో తల్లిదండ్రులతో కలిసి గోడు చెప్పుకున్నాడు. తనపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరాడు. పట్టణంలోని గౌతమీనగర్‌కు చెందిన వెంకటరమణ, అంజలిల కుమారుడు ఆదిరామమూర్తి(17)ని అదే కాలనీకి చెందిన ప్రవీణ్ శనివారం తన బర్త్‌డే పార్టీ సీటీఎంలో ఇస్తున్నానని తప్పకుండా రావాలని కోరి వెంట తీసుకెళ్లాడు. సీటీఎంలోని మిల్లుకు ఎదురుగా ఉన్న లేఅవుట్‌లోకి వెళ్లిన స్నేహితుల మధ్య ఉన్నట్లుండి గొడవలు మొదలయ్యాయి. నెలరోజుల క్రితం జరిగిన గొడవలో వేరొకరిని ప్రవీణ్ కొడుతుండగా, ఆదిరామమూర్తి అడ్డుకోవడం జరిగిందన్నారు. దీన్ని మనస్సులో ఉంచుకున్న ప్రవీణ్ ఉద్దేశపూర్వకంగా తనను బర్త్‌డే పార్టీ పేరుతో ఆహ్వానించాడన్నారు. ఇది తెలియని తాను నిజమనుకుని వెళితే... ప్రవీణ్‌తో పాటు స్నేహితులైన నాని, నౌషాద్, చింటూ, చందూ తదితరులు కలిసి ఆదిరామమూర్తిపై బెల్టులు, కర్రలతో దాడిచేశారు. కాలితో తన్నుతూ, జుట్టుపట్టుకుని నేలమీద ఈడుస్తూ కొట్టడం చేశారు. దీన్ని మరో స్నేహితుడు వీడియోలో చిత్రీకరించాడు. దెబ్బలతో పడి ఉన్న తనని అక్కడే వదిలేసి వెళితే తాను అక్కడి నుంచి నేరుగా టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదుచేశానన్నాడు. అయితే వారు తమ పరిధిలోకి రాదని సూచిండంతో ఆదివారం తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు రాగా, ఉదయం నుంచి సాయంత్రం వరకు తమను ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. చివరికి రాత్రి సీఐను కలిసి తమ గోడు చెప్పుకుంటే బాధితులను పిలిచి విచారించకపోగా, వాళ్లు పిలిస్తే నువ్వు ఎందుకు వెళ్లావంటూ తమపైనే రుబాబు ప్రదర్శించాడని వాపోయారు. దీంతో తాము అక్కడి నుంచి వచ్చేశామన్నారు. తమకు న్యాయం చేయాలని వినతిచేశారు. ఈ విషయమై తాలూకా సీఐ సత్యనారాయణను వివరణ కోరితే... కేసు విషయంలో క్లారిటీ లేకపోవడంతో ఒకరోజు వేచిచూశామని, బాధితుడి నివాసం రామారావు కాలనీ టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుందని, జరిగిన ఘటన తాలూకా పరిధిలో కావడంతో విచారించి కేసు నమోదుచేశామన్నారు. బాధితుడిని తిట్టాల్సిన అవసరం తమకు లేదని, కేవలం కౌన్సెలింగ్ మాత్రమే చేశానన్నారు. ఆదిరామమూర్తి ఇంటర్మీడియట్ చదువుతూ దుర్వ్యసనాలకు లోనయ్యాడన్నాడు. తల్లిదండ్రులు ఇద్దరూ దినసరి కూలీలు కావడంతో వారి కష్టాన్ని చూసి చెడుఅలవాట్లు చేసుకుంటే ఎలా అని, గౌరవంగా బతకాలని కౌన్సెలింగ్ ఇచ్చినట్లు చెప్పారు.

# వేధింపులతో యువతి ఆత్మహత్య


శ్వేత (ఫైల్)

మదనపల్లె : ప్రేమించిన వ్యక్తి పెళ్లి చేసుకోకుండా మోసం చేయడంతో పాటు, వేధింపులకు గురిచేయడంతో మనస్తాపం చెందిన ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మదనపల్లెలో జరిగింది. కోళ్లబైలు పంచాయత్ జగన్‌కాలనీకి చెందిన జీ.చంద్రశేఖర్, శోభల కుమార్తె జీ.శ్వేత (25) పట్టణంలోని మోతీనగర్‌కు చెందిన షాకీర్‌ను ప్రేమించింది. వివాహం చేసుకుంటానని చెప్పడంతో ఏడాదిన్నర క్రితం అందరినీ వదులుకుని అతనితో వెళ్లింది. అయితే ఏడాదిన్నర కాలంగా కాలయాపన చేస్తూ పెళ్లి విషయాన్ని దాటవేశాడు. అంతేకాకుండా తరచూ వేధింపులకు గురి చేశాడు. తల్లిదండ్రులు మృతి చెందడం, సోదరితో విభేధాలు, ప్రేమించిన వ్యక్తి నుంచి వేధింపులు.. వీటిని తట్టుకోలేక మనస్తాపంతో ఇంట్లోనే ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన స్థానికులు తాలూకా పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ సత్యనారాయణ ఆదేశాల మేరకు పోలీసులు సంఘటనా స్థలాని చేరుకున్నారు. వివరాలు సేకరించారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి సోదరుడు పునీత్ ఫిర్యాదు మేరకు తాలూకా సీఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### విద్యుదాఘాంతో గేదే మృతి

చిట్వేలి : మండలంలోని మైలపల్లిలో సొదామికి చెందిన రూ. 90 వేలు విలువచేసే గేదె సోమవారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. గేదె పంట పొలాల్లో మేస్తుండగా విద్యుత్‌స్తంభానికి ఉన్న స్టేవైర్ తగలండంతో షాక్‌కు గురై చనిపోయింది.



# ఆన్‌లైన్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

**రూ.24లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు**

మదనపల్లె : ఆన్‌లైన్‌లో ఉద్యోగం ఇప్పిస్తామని ఓ సాఫ్ట్‌వేర్ యువతిని మోసం చేసి సైబర్ నేరగాళ్లు రూ.24లక్షలు నగదు కాజేసిన సంఘటన మదనపల్లె పట్టణంలో జరిగింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా కేసు నమోదుచేశారు.

పట్టణంలోని రెడ్డీస్‌కాలనీకి చెందిన ప్రసన్న బెంగళూరులో ఓ ప్రైవేట్ సంస్థలో పనిచేస్తోంది. ఇటీవల ఆమెకు సోషల్‌మీడియా వాట్సప్, ఇన్‌స్టాగామ్‌లలో రోజుకు 2–3 గంటలు పనిచేస్తే రూ.15–20 వేల వేతనం వస్తుందని ఓ మెసేజ్ వచ్చింది. దీంతో ఆమె పార్ట్‌టైమ్ జాబ్ కోసం అప్లై చేసుకుంది. మెసేజ్ ఓపెన్ చేసిన తర్వాత బీఓబీ ముద్ర గ్రూప్ ఆఫ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో సంస్థకు సంబంధించిన సమాచారం వచ్చింది. అక్కడి సంకేతాల ప్రకారం బాధితురాలు తన వ్యక్తిగత, బ్యాంకు వివరాలను నమోదుచేసింది. దీంతో సదరు గ్రూపు ఆమెను గ్రూపులో చేర్చినట్లు సమాచారం అందించింది. అందులో ఉన్నవారంతా జాబ్ చేస్తున్నారని సమాచారం ఉండటంతో ఆమె నమ్మి జాయిన్ అయింది. అనంతరం హెచ్‌ఆర్ విభాగం పేరుతో గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేశారు. తాము పంపించే లింక్ ద్వారా ఆన్‌లైన్ ట్రేడింగ్ చేస్తే పెద్ద మొత్తంలో డబ్బు వస్తుందని, గ్రూపులోని సభ్యులు కూడా నగదు కట్టి ట్రేడింగ్ చేస్తున్నారని నమ్మించారు. ఆమె గ్రూపు సభ్యులను విచారించగా, తాము చేస్తున్నట్లు చెప్పారు. ఈ వ్యవహారాన్ని నమ్మిన ఆమె ఆన్‌లైన్ ట్రేడింగ్ చేయడంలో భాగంగా డబ్బు పెడుతూ వచ్చింది. ఆమె ఖాతాలో డబ్బు పడుతున్నట్లు సమాచారం అందడంతో అత్యాశకు గురైన బాధితురాలు రూ.7వేలు నుంచి మొదలుపెట్టి తన ఖాతాలో ఉన్న రూ.6లక్షలను ట్రేడింగ్ చేసింది. అంతేకాకుండా తన చెల్లెలు ఇంటికోసం తనవద్ద ఉంచిన రూ.18లక్షలను విడతల వారీగా అందులో పెట్టింది. అయితే వ్యక్తిగత ఖాతాలో డబ్బు చూపిస్తున్నప్పటికీ నగదు తీసుకునేందుకు వీలుకాకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించింది. వెంటనే తనకు జరిగిన మోసంపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. ఈ మేరకు చీటింగ్, సైబర్ నేరం కింద కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు. ప్రజలు ఆన్‌లైన్ జాబ్స్ పేరుతో వచ్చే మెసేజీలు నమ్మవద్దని, ఆన్‌లైన్‌లో వస్తువులు కొనుగోలు చేసినా క్యాష్ ఆన్ డెలివరీ ఆప్షన్‌తో బుక్ చేసుకోవాలని సూచించారు.

### దళితులు ఐక్యంగా ఉండాలి


జిల్లా ఎస్పీని కలిసిన సత్యాల రామకృష్ణ, దాసరి పెంచలయ్య

రాజంపేట : మండలంలోని కొల్లవారిపల్లె మిట్టహరిజనవాడకు చెందిన దళితులు ఐక్యంగా కలిసిమెలిసి అన్నదమ్ముల్లా ఉండాలని జిల్లా ఎస్పీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు సత్యాల రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ జిల్లా ప్రధానకార్యదర్శి దాసరి పెంచలయ్యలు పేర్కొన్నారు. సోమవారం జిల్లా ఎస్పీని కలిసిన అనంతరం స్థానిక రూరల్ పోలీసుస్టేషన్ వద్ద వారు విలేకర్లతో మాట్లాడారు. టీడీపీ నేత వైఖరి వల్ల దళితులు చీలిపోయి కొట్టుకునే పరిస్థితికి రావడం బాధకరమన్నారు. ఇకపై ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా దళితులందరూ ఒక మాటపై నిలబడాలన్నారు. దళితులపై జరుగుతున్న దాడులు, తదితర అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఎస్పీ కూడా సానుకూలంగా స్పందించారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దళితులకు అన్ని విధాలుగా మేలు చేసే కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు.

**11మందిపై బైండోవర్ కేసులు..**

కొల్లవారిపల్లె మిట్టహరిజనవాడకు చెందిన 11 మంది దళితులపై రాజంపేటరూరల్ పోలీసుస్టేషన్‌లో బైండోవర్ కేసులు నమోదు చేశామని రూరల్ సీఐ పుల్లయ్య తెలిపారు. మరోసారి గొడవలకు దిగమని హామీ తీసుకుంటూ కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు.

### క్రీడలతో నందలూరుకు ప్రత్యేక గుర్తింపు


అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న మహారాష్ట్ర ఐపీఎస్ అధికారి ధీరజ్‌కుమార్

నందలూరు (రాజంపేట) : సివిల్స్‌లోనే కాదు క్రీడల్లో కూడా నందలూరుకు ప్రత్యేక గుర్తింపు ఉందని మహారాష్ట్రలోని బీడ్ జిల్లా మాజల్గామ్ ఏఎస్పీ ఐపీఎస్ అధికారి బచ్చు ధీరజ్‌కుమార్ అన్నారు. సోమవారం నందలూరు క్రీడామైదానంలో పలు అభివృద్ధి పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నందలూరు క్రీడామైదానానికి వందేళ్లకుపైగా చరిత్ర ఉందన్నారు. ఎందరో క్రీడాకారులు ఫుట్‌బాల్, వాలీబాల్, క్రికెట్, హాకీ, కబడ్డీ తదితర క్రీడల్లో రాణించారన్నారు. ఇప్పుడు క్రికెట్ రంగంలో ఈ మైదానం నుంచి రాష్ట్ర, జిల్లా స్థాయిలో క్రికెటర్లు రాణించడం గర్వకారణమన్నారు. ఇప్పుడు ఉభయ జిల్లాలకే క్రికెట్ గ్యారేజ్‌గా నందలూరు క్రీడామైదానం మారిందన్నారు. ఐకేపీఎస్ అధ్యక్షుడు మస్తానయ్య మాట్లాడుతూ ప్రహరీగోడ (వాహనాలు గ్రౌండ్‌లోకిరాకుండా), క్రీడాసభావేదిక తదితర పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో సీడీవైఏ సబ్‌సెంటర్ కోచ్ సయ్యద్ గయాస్, కోచ్ ఫైరోజ్‌ఖాన్‌లోడి, ట్రైనర్, దివ్యాంగ క్రికెటర్ శివకోటి, గ్రౌండ్ యూత్‌కమిటి ప్రతినిధులు పల్లె గ్రీష్మంత్‌రెడ్డి, ముమ్మడిశెట్టి సుధాకర్, పుత్తా శంకర్, సుబ్బరాయుడు, హెచ్‌ఆర్‌పీఎస్‌సీ మైనార్టీ అధ్యక్షుడు జుల్ఫీకర్, మల్లెల విజయుడు తదితరులు పాల్గొన్నారు.